క్లుప్తంగా

పెండింగ్ డీఏలు చెల్లించాలి

దర్శి: కూటమి ప్రభుత్వం పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలని దర్శి నియోజకవర్గ పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు పి.నాసరయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్.రామారావులు ప్రభుత్వాన్ని మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని, ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఉద్యోగులను ఇబ్బందులు పెట్టడం మంచి పద్ధతి కాదని వారు హితవు పలికారు.

సీపీఐ కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

యర్రగొండపాలెం: భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈ నెల 26వ తేదీన ఒంగోలులో జరిగే ప్రదర్శన, బహిరంగ సభలను విజయవంతం చేయాలని మంగళవారం స్థానిక పూల సుబ్బయ్య శాంతి భవన్‌లో ఆ పార్టీ నాయకులు కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమాలకు నియోజవర్గం నుంచి భారీ ఎత్తున ప్రజలు తరలిరావాలని కోరారు. ఆ పార్టీ నాయకులు డి.శ్రీనివాస్, టీసీహెచ్ చెన్నయ్య, కేవీ కృష్ణగౌడ్, బి.రామయ్య, ఎస్.తిరుపతయ్య పాల్గొన్నారు.

మానసిక వికలాంగులను ఆదరించాలి


భోజనాలు వడ్డిస్తున్న వికలాంగులు

యర్రగొండపాలెం: మానసిక దివ్యాంగులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని, తాము చేసుకునే శుభకార్యాలను వారి మధ్య చేసుకుంటే ఎంతో ఆనందంగా ఉంటుందని వికలాంగుల హక్కుల పోరాట సమితి సంక్షేమ సేవా సంఘ జిల్లా అధ్యక్షుడు గుమ్మ రాజయ్య అన్నారు. మంగళవారం 65వ ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక సన్‌జో మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో భోజనాల కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆ సంఘ నాయకులు పోలేపల్లి పెద్ద పాలంకయ్య, కనమాల కోటేశ్వర్లు, షేక్ నాసర్‌వలి, ఎస్.వెంకటరెడ్డి, టి.కోటి పాల్గొన్నారు.

ఘనంగా ఈశ్వరీదేవి ఆరాధన మహోత్సవం


అలంకరణలో ఈశ్వరీదేవి

దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో శ్రీవీరబ్రహ్మేంద్రుల స్వామి వారి మనవరాలు శక్తి స్వరూపిణి శ్రీ ఈశ్వరీదేవి 235వ ఆరాధన మహోత్సవం భక్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. భైరవానంద స్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేశారు. అర్చకులు మణిబాబుశర్మ ప్రత్యేక పూజలు చేసి మహా నైవేద్యాలు సమర్పించి సామూహిక హారతులిచ్చారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇండ్లచెరువు గ్రామస్తులు కుర్రా నాసరయ్య, చెంచమ్మ దంపతులు అన్నదానం చేశారు.

చిల్లచెట్ల తొలగింపు


చిల్లచెట్లు తొలగిస్తున్న జేసీబీ

దొనకొండ: మండలంలోని బాదాపురం ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారి చిల్లచెట్లతో అధ్వానంగా తయారైంది. గ్రామస్తుల కోరిక మేరకు రహదారికి ఇరువైపులా చెట్లను ప్రభు చారిటబుల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదిమూలపు ప్రభుదాసు శుభ్రం చేయించారు. ఆనంద్‌కుమార్, ఐజక్ డయాస్ సహాయక కార్యక్రమంలో పాల్గొన్నారు.

పది విద్యార్థుల అర్ధాకలి

- ప్రత్యేక తరగతులతో చిన్నారుల అవస్థలు
- అల్పాహారం లేక ఇబ్బందులు


పుల్లలచెరువు జెడ్పీ పాఠశాల ప్రత్యేక తరగతుల్లో పదో తరగతి విద్యార్థులు

పుల్లలచెరువు: ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దాని వెనుక ఉన్న విద్యార్థుల ఇబ్బందులను ప్రభుత్వం, అధికారులు పట్టించుకున్నట్లుగా లేదు. వచ్చే ఏడాది మార్చి 17 నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో విద్యార్థులకు అల్పాహారం అందడం లేదు. విద్యార్థులు అర్ధాకలితోనే చదువుపై ఏకాగ్రత పెట్టాల్సి వస్తోంది.

మధ్యాహ్న భోజనంతో సరి

యర్రగొండపాలెం నియోజికవర్గంలోని ఐదు మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 3,350 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వీరిలో చాలా మంది సమీప గ్రామాల నుంచి బస్సులు, ఆటోల్లో పాఠశాలకు రావాల్సి ఉంటుంది. ఉదయం ప్రత్యేక తరగతులు ఉండటంతో అల్పాహారం తీసుకోకుండానే వస్తున్నారు. మధ్యాహ్నం అందించే భోజనంతో సరిపెట్టుకుంటున్నారు. తిరిగి ఇళ్లకు చేరే సరికి సాయంత్రం 6 గంటలుపైనే అవుతుండటంతో ఆకలితోనే చదువు కోవాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సెలవు రోజుల్లో సమస్య అధికం

విద్యాశాఖ వంద రోజుల ప్రణాళికను రెండో శనివారం, ఆదివారం, ఇతర సెలవు దినాల్లో సైతం అమలు చేస్తుండటంతో విద్యార్థులకు బస్సు పాసులు కూడా చెల్లడం లేదు. అదే విధంగా మధ్యాహ్న భోజనం కూడా అందడం లేదు. చార్జీలు పెట్టుకుని వచ్చి ఇళ్ల నుంచి భోజనం తెచ్చుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే సెలవు దినాల్లో కూడా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తే బాగుంటుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. అర్ధాకలితో చదువు ఎలా కొనసాగిస్తారో అధికారులకే తెలియాలి. వారికి ఆకలి తీరినప్పుడే చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టగలరు.

నియోజకవర్గంలో పదో తరగతి విద్యార్థుల వివరాలు

మండలం	విద్యార్థుల సంఖ్య
పుల్లలచెరువు	400
త్రిపురాంతకం	779
పెద్దారవీడు	589
యర్రగొండపాలెం	927
పెద్దదోర్నాల	610

> **ఉన్నతాధికారులకు తెలియజేస్తాం**
>
> ప్రత్యేక తరగతుల్లో పదో తరగతి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. గతంలో కొన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు దాతలు అల్పాహారం అందజేశారు. గ్రామాల్లోని దాతలు సైతం ముందుకొచ్చి విద్యార్థులకు అల్పాహారం అందజేస్తే బాగుంటుంది.
>
> శామ్యూల్ జాన్, డిప్యూటీ డీఈవో, మార్కాపురం

ప్రభుత్వ భూములను కాపాడండి


దొనకొండ: మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి


తహసీల్దార్ శైలేంద్రకుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న స్థానికులు

పెద్దారవీడు: తోకపల్లి పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, వాటిని కాపాడాలని తహసీల్దార్ శైలేంద్రకుమార్‌కు స్థానికులు వినతపత్రం అందజేశారు. మండలంలోని తోకపల్లి ఎంపీపీ పాఠశాలలో మంగళవారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. హనుమాన్ జంక్షన్‌కుంట గ్రామానికి దగ్గరలో ఉన్న ఓబులక్కపల్లి రెవెన్యూ పరిధిలో 37-4 సర్వే నంబర్‌లో 1.46 సెంట్ల భూమిని గతంలో శ్మశానంగా స్థానికులు వాడుకుంటున్నారు. ఇటీవల కాలంలో మార్కాపురం పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త అక్రమించుకొని రేకుల షెడ్లు ఏర్పాటు చేసి ఇతరులకు అద్దెలకు ఇచ్చారని అర్జీలో పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రణదారుల నుంచి కాపాడాలని, హనుమాన్‌జంక్షన్ కుంట గ్రామ ప్రజలకు ఉపయోగపడే విధంగా పిల్లల కోసం ప్రభుత్వ పాఠశాల, ప్రయాణికులకు బస్టాండ్, మరుగుదొడ్లు, తాగునీటి కోసం నీటి ట్యాంక్‌లు, దేవాలయం నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని అధికారులకు స్థానికులు విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ సదస్సులో పలు రకాల భూముల సమస్యలపై 17 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. తహసీల్దార్ శైలేంద్రకుర్‌కు వినతిపత్రం అందించిన వారిలో సరాల వెంకటనారాయణ, వెన్నా బోడిరెడ్డి, మైలా నాగయ్య, చేతుల నాగరాజు, దొండపాటి జాన్‌రావు ఉన్నారు. ఆర్ఐ గోపి, సర్వేయర్ రామగోపాలరెడ్డి, వీఆర్వో సంజీవరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 59 అర్జీలు

దొనకొండ: మండలంలోని మల్లంపేటలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సభకు 59 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ బి.రమాదేవి తెలిపారు. పెండింగ్ సమస్యలు పరిష్కరించేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నామని, రైతుల నుంచి వచ్చిన అర్జీలను తమ వీఆర్‌ఓలతో విచారించి పరిష్కరించి అర్హులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ భరోసా ఇచ్చారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కేవీ నాగార్జునరెడ్డి, వీఆర్‌ఓ టి.శివ కోటేశ్వరరావు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఆముదం విత్తనాల పంపిణీ


పుల్లలచెరువు: మొక్కజొన్న పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్న ఏవో


విత్తనాలు పంపిణీ చేస్తున్న రమేష్


పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న బాలాజీనాయక్


మిర్చి పొలాలను పరిశీలిస్తున్న రవి వెంకన్నబాబు

దొనకొండ: మండలంలోని రుద్రసముద్రంలో రైతులకు సామూహిక ప్రదక్షిణ క్షేత్రాలు పథకం కింద వ్యవసాయ శాఖ మంగళవారం ఉచితంగా ఆముదం విత్తనాలు పంపిణీ చేశారు. దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ బి.రమేష్ పాల్గొని 21 మంది రైతులకు 42 ఎకరాలకు 84 కేజీలు ఐసీహెచ్ 05 అను ఆముదం హైబ్రీడ్ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆముదం పంట ఐసీహెచ్ 05 శీతాకాలంలో అనుకూలంగా ఉంటుందని, నీటి సదుపాయం ఉంటే పూత దశకు ముందు ఒకసారి కాయదశలో మరొక సారి నీరు పెడితే ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని తెలిపారు. ఆముదం పంటలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. 2 గ్రా కార్బోడైజియం, మాల్కోజబ్ కలిపి విత్తనశుద్ధి చేస్తే వేరు కుళ్లు నుంచి కాపాడుకోవచ్చని తెలిపారు.

పురుగుమందుల వాడకం తగ్గించాలి

రైతులు పురుగుమందులు పరిమితంగా వాడాలని డాక్టర్ రమేష్ సూచించారు. ఎక్కువ మందులు వాడి నష్టపోవద్దని, పరిమితంగా ఉండే మందులు వాడి అధిక దిగుబడులు పొందాలని కోరారు. మండల వ్యవసాయాధికారి ఎన్.లక్ష్మీనారాయణ, సహాయకులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడు పంచాయతీ సిద్ధినాయునిపల్లి, పుచ్చకాయలపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. గ్రామాల్లో మిరప, అముదం పంటలను పరిశీలించి మిరప పంటలో పూత పురుగు, కాయ తొలుచు పరుగులు గుర్తించారు. ఆమె మాట్లాడుతూ పూత పురుగు ఆశించిన మొక్కలు కాయలు ముడుచుకొని పోయి పూర్తిగా అభివృద్ధి చెందకుండా వంకరగా మారుతాయని, తల్లి పురుగు దోమలా ఉండి పసుపు గోధుమ రంగులో ఉంటాయని చెప్పారు. పురుగు నివారణకు వేపనూనె 1500 పీపీఎం 3 ఎంఎల్ లేక ప్రిప్రోనిల్ 2 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పంటపై పిచికారీ చేసుకోవాలన్నారు. వీఏఏలు ఆదిలక్ష్మి, లాలూనాయక్, రైతులు పాల్గొన్నారు.

మిరపలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ముండ్లమూరు (దర్శి): మిరప పంటలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యాన వన శాఖాధికారి ఎం.రవి వెంకన్న బాబు అన్నారు. మండలంలోని ఉమామహేశ్వరపురంలో మిరప పొలాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రవి వెంకన్నబాబు మాట్లాడుతూ మిరప పంటలో తామర పురుగులు, నల్లి తెగులు ఎక్కువగా ఉండటం గమనిచామన్నారు. తామర పురుగు ఆకు అడుగు భాగంలో గుంపులుగా చేరి రసాన్ని పీల్చడంతో ఆకులపై బొబ్బలు ఏర్పడి ఆకు అంచులు పైకి ముడుచుకుని ఉంటాయని చెప్పారు. పురుగులు లేత కాయలను ఆశించి రసాన్ని పీల్చడంతో కాయలు మీద చారలు ఏర్పడి గిడసబారుతాయన్నారు. రసాన్ని పీల్చే పురుగులు అక్టోబర్‌లో మొదలై నవంబర్, డిసెంబర్ వరకు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. ఆకు అడుగు భాగాన్ని చేరి రసాన్ని పీల్చడంతో ఆకులు వెనక్కు ముడుచుకుపోయి తిరగేసిన ఏడో ఆకారంలో కనిపిస్తాయని చెప్పారు. అందుకు నివారణ మందులు వివరించారు.

పుల్లలచెరువు: సాగు చేసిన పంటలపై తగు జాగ్రత్తలు తీసుకుని ఎరువులు, మందులు వాడితే అధిక దిగుబడులు సాధించవచ్చని ఇన్‌చార్జి వ్యవసాయాధికారి మాల్యాద్రి తెలిపారు. మంగళవారం మండలంలోని పెద్ద పీఆర్‌సీ తండా, యండ్రపల్లి గ్రామాల పరిధిలో పోలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో మొక్కజొన్న, మినుము, మిరప పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేసినట్లు ఏవో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో సాగు చేసిన ప్రతి పంటకు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగును గమనించామని, దాని నివారణకు ఎకరాకు 10 లింగాకార్షక బుట్టలు అమర్చుకోవాలన్నారు. వేపనూనె 10 ఎంఎల్, క్లోరంట్రానిలిప్రోల్ 80ఎంఎల్ మొక్క మొవ్వులో పడేలా పిచికారీ చేయాలని సూచించారు. మినుములో బూడిద తెగులు ఉందని, దాని నివారణకు కార్బండజైం పిచికారీ చేయాలన్నారు. మిరప పంటలో తగు సూచనలు తీసుకుని మందులు వాడుకోవాలన్నారు. వీఏఏ అనితాకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగం పరిశీలన

తాళ్లూరు: మండలంలోని లక్కవరం, నాగంబొట్లపాలెం, నాగంబోట్లపాలెం గ్రామాల్లో నిర్వహించిన పంటకోత ప్రయోగాన్ని దర్శి సహాయ వ్యవసాయ సంచాలకులు కె.బాలజీనాయక్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటకోత ద్వారా వచ్చిన వివరాలు పరిశీలించి గణాంక శాఖకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. వాతావరణంలో జరుగుతున్న మార్పులు కారణంగా వర్షం కురుస్తున్న తరుణంలో రైతులు పంట కోతకు వచ్చిన వరిపైర్లను, ధాన్యపు నిల్వలను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఇన్సూరన్స్, తెలుగుళ్లపై అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు, రామిరెడ్డి, భార్గవి, వీరాంజనేయులు రైతులు పాల్గొన్నారు..


పెద్దారవీడు: తెగుళ్ల నివారణపై సూచనలిస్తున్న ఏఓ బుజ్జిబాయి

నాటుసారాతో జీవితాలను నాశనం చేసుకోవద్దు


సుద్దకురవ తండాలో ప్రజలతో మాట్లాడుతున్న ఎక్సైజ్ అధికారులు

పుల్లలచెరువు: గ్రామాల్లో నాటుసారాతో జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ నరహరి కోరారు. మంగళవారం మండలంలోని మెట్టబోడు తండా, సుద్దకురవ తండాలో నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు యర్రగొండపాలెం ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా తండా వాసులు అధికారులతో మాట్లాడుతూ తమ తండాలో నాటు కాయడం, అమ్మకాలు చేయడం లేదని, అలా చేస్తే తండాలో పెద్దలు లక్ష రూపాయల జరిమానా విధిస్తారని, తండాలో ఎవరూ నాటుసారా తయారీ, అమ్మకాలు చేయడం లేదని, తెలిపారు. సీఐ నరహరి మాట్లాడుతూ నవోదయం-2లో భాగంగా సారా రహిత ఏపీగా ఉండాలనే లక్ష్యంతో ఎక్సైజ్ శాఖ ఏసీ విజయ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నాటుసారాతో జీవితాలు అతలాకుతలం అవుతాయని, పిల్లలు ఎందుకూ పనికి రాకుండా పోతారని, ప్రభుత్వం నిర్దేశించిన బాటలో పయనించాలని కోరారు. నాటుసారా తయారీ, గంజాయి వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం నేరమని, మండలంలోని ప్రతి గ్రామం సుద్దకురవ తండాను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సీఐ నరహరి ఆకాంక్షించారు. గ్రామాల్లో ఎక్కడైనా నాటుసారా తయారీ, అమ్మకాలు చేయడం వంటి సమాచారం ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. చెప్పిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. తండాల్లో గతంలో నాటుసారా తయారీలో ముద్దాయిలైన వారి ఇళ్ల వద్దకు వెళ్లి వారి కుటుంబ వివరాలు అడిగి తెలుసుకొని ప్రస్తుతం జీవన విధానం ఏంటని అడిగినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో స్క్వాడ్ సీఐ బాషా, ఎస్ఐ కృష్ణారావు పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో నిందితుడికి రిమాండ్

దర్శి: తప్పుడు వీలునామాలు సృష్టించి ఇతరులకు రిజిస్ట్రేషన్ చేసినందుకు చీటింగ్, ఫోర్జరీ కేసులో గుర్రం మోహన్‌బాబుకు కోర్టులో 14 రోజులు రిమాండ్ విధించారు. ఎస్ఐ మురళి తెలిపిన వివరాల ప్రకారం.. రాజంపల్లి గ్రామానికి చెందిన గుర్రం వెంకటేశ్వర్లు, గుర్రం శ్రీనివాసులు అనే వారికి చెందిన 18 సెంట్ల స్థలానికి సంబంధించి అదే గ్రామానికి చెందిన గుర్రం మోహన్‌బాబు తప్పుడు వీలునామా సృష్టించారని, ఇతరులకు రిజిస్ట్రేషన్ చేసినందుకు కేసు నమోదు చేసి కోర్టులో ఆయన్ను హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు.

27న విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

యర్రగొండపాలెం: అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీలు పెంచేది లేదని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై పెనుభారం మోపిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి విమర్శించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కరెంట్ చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాట కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ నెల 27న నిరసన తెలిపి విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేస్తామని, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, నాయకులు కె.ఓబులరెడ్డి, దోమకాల వెంకటేశ్వర్లు, ఎం.బాలగురవయ్య, జబీవుల్లా, ఏకుల మునలారెడ్డి, ఎస్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, కోటిరెడ్డి, రోషిరెడ్డి, కె.సత్యనారాయణరెడ్డి, రాములు నాయక్ పాల్గొన్నారు.

క్రిస్మస్‌కు సర్వం సిద్ధం


సందడిగా అమ్మవారిశాల వీధి


దుస్తులు పంపిణీ చేస్తున్న సొసైటీ సభ్యులు

పెద్దదోర్నాల: క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు మండలంలోని పలు చర్చిలు ముస్తాబయ్యాయి. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని వివిధ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో పాటు రంగురంగుల విద్యుద్దీపాలు, నక్షత్రాలతో క్రీస్తు దేవాలయాలను శోభాయమానంగా అలంకరించారు. క్రిస్మస్ వేడుకలను నవంబర్ 25 నుంచి డిసెంబర్ 25 వరకు నెల రోజుల పాటు నిర్వహించుకోవటం ఆనవాయితీ. డిసెంబర్ 24వ తేదీ రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకల్లో క్రిస్మస్ కేక్ కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పట్టణ పురవీధుల్లోని క్రైస్తవ గృహాలను దర్శించి క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పారు. డిసెంబర్ 25 క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆయా ప్రార్థన మందిరాల్లో క్రీస్తు జననం గురించిన బోధనలు వినిపిస్తారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. దేవుని భక్తి గీతాలు ఆలపిస్తారు. రాత్రి 7 గంటల నుంచి క్రీస్తు పుట్టుక గురించి సాంస్కృతిక నాటికలు ప్రదర్శిస్తారు. క్రిస్మస్ పర్వదినం సమీపిస్తుండటంతో గ్రామాల్లో క్రిస్మస్ సందడి ప్రారంభమైంది. క్రిస్మస్‌కు పది రోజుల ముందు నుంచే పట్టణంలోని పలు దుకాణాల్లో క్రిస్మస్ ట్రీలు, నక్షత్రాలు విక్రయించేందుకు సిద్ధం చేశారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు తమ గృహాలపై క్రిస్మస్ నక్షత్రాలు విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించుకున్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఏబీఎం, లూథరన్, ఆర్‌సీఎం, హెబ్రోను, కపెర్న హోం, లివింగ్ ఫెలోషిప్, లేమన్ పెలోషిప్, చర్చి ఆఫ్ క్రైస్ట్, హోసన్నా, బ్రదరన్, ఏసు పిలుచుచున్నాడు.. తదితర ప్రార్థన మందిరాలన్నీ సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. క్రిస్మస్ స్టార్‌లు, ట్రీలు, నూతన దుస్తులు కొనుగోలు చేసేందుకు క్రైస్తవులు ఉత్సాహం చూపడంతో మండల కేంద్రంలోని దుకాణాలన్నీ కొనుగోలుదారులతో సందడిగా మారాయి.

క్రిస్మస్ కానుకల పంపిణీ

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని పనుకుమడుగు గిరిజన గూడెం గిరిజన విద్యార్థులకు మంగళవారం నూతన దుస్తులతో పాటు క్రిస్మస్ కానుకలు పంపిణీ చేశారు. ఇండియన్ మిషనరీ సొసైటీ జిల్లా ఇన్‌చార్జి సింగారం సెల్విన్, రూతు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షెక్షావలి నూతన దుస్తులు, క్రిస్మస్ కానుకలు, టూత్ పేస్టు, సబ్బులు పంపిణీ చేశారు. దగ్గుల శివ, మహబూబ్‌బాషా, సర్దార్, కృష్ణారెడ్డి, సొసైటీ సభ్యులు మెర్సీ, దీక్షన్‌బాబు, అనిత తదితరులు పాల్గొన్నారు.

దొనకొండ: స్థానిక ఆర్‌సీఎం చర్చిలో సంఘస్తులు పశువుల పాకను అందంగా ఏర్పాటు చేశారు. క్రిస్మస్ సందర్భంగా పశువుల పాకలో బాలయేసు, మరియ తల్లి, జోజప్ప, గొల్లలు, పశువులు, గొర్రెలతో కూడిన బొమ్మలు పెట్టారు.